జగనన్న సురక్ష..సేవలకు రక్ష

- ఉచితంగా 11 రకాల సేవలు
- పండగలా ధ్రువపత్రాల పంపిణీ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు


హెల్ప్‌డెస్క్‌లో సేవలు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కుల, మత, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోంది. అయితే అర్హతలు ఉన్నా కొన్ని రకాల కారణాల వల్ల పథకాలకు నోచుకోక పోవడం, పూర్తిస్థాయిలో ధ్రువపత్రాలు లేకపోవడం వంటి కారణాలతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా 11 రకాల సేవలను అందిస్తున్నారు. వలంటీర్లు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు ఓ యజ్ఞంలా నిర్వహించి అవసరమైన సర్టిఫికెట్లు అందిస్తున్నారు. ప్రతి రోజు కార్పొరేషన్, సచివాలయం పరిధిలో కార్యక్రమం నిర్వహించి మంత్రులు, ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు సభ ఏర్పాటు చేసి అర్హులకు ధ్రువపత్రాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 18263 మంది దరఖాస్తు చేసుకోగా 13859 మందికి అప్రూవల్ చేసి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ నెలాఖరు వరకు కార్యక్రమం కొనసాగనుంది.

సేవలు..కావాల్సిన ధ్రువపత్రాలు

- **కుల ధ్రువీకరణ పత్రం:** ఆధార్, రేషన్‌కార్డు, పాత కుల ధ్రువీకరణ పత్రం. గతంలో కుటుంబంలో ఎవరికైనా ఇచ్చిన పాత కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్సు కాపీలు.
- **ఆదాయ:** ఆధార్, రేషన్‌కార్డు జిరాక్సు కాపీలు
- **జనన:** ఆస్పత్రిలో జన్మించినట్లు ఆధారపత్రం, అఫిడవిట్, ఎన్‌ఓసీ, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్సు కాపీలు,
- **మరణ:** మరణించినట్లు ప్రూఫ్, అఫిడవిట్, ఎన్‌ఓసీ, ఆధార్, రేషన్ జిరాక్సుకాపీలు
- **మ్యుటేషన్ అండ్ టైటిల్‌డీడ్, పట్టాదారుపాస్ పుస్తకం,** అప్లికేషన్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, పాత పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ (సెల్లర్ పీపీబీ/టీడీ), పన్నుచెల్లింపు రశీదు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, సంతకం
- **వివాహ ధ్రువీకరణ పత్రం:** దరఖాస్తు, పెళ్లిలో దండలు మార్చుకున్న ఫోటో/తాళికట్టిన ఫొటో, పెళ్లి కార్డులు, వధూ వరుల ఆధార్‌కార్డులు, రెసిడెన్షియల్ ప్రూఫ్ (ఆధార్, రేషన్, కరెంట్‌బిల్లు, టెలీఫోన్ బిల్లు, ఓటర్‌ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, జాబ్‌కార్డు)
- **ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎమ్‌సీ):** దరఖాస్తు, నోటరీ , వయస్సు, మరణించినవారు ఉంటే సంబంధం తెలియజేసే ప్రూఫ్, డాక్యుమెంట్లు (రేషన్, ఓటర్, పాస్‌పోర్టు, పాస్‌బుక్, ఆధార్‌కార్డ్స్), డెత్ సర్టిఫికెట్/ ఎఫ్ఐఆర్ కాపీ.
- **మొబైల్‌కి పట్టాదార్ సీడింగ్ ల్యాండ్ రికార్డ్స్:** మీ–సేవ అప్లికేషన్, ఆధార్ కార్డు జిరాక్సు, సెల్ నెంబర్
- **క్రాప్ కల్టివేషన్ రైట్స్‌కార్డ్స్ (సీసీఆర్‌సీ):** ఆధార్ జిరాక్సు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, భూయజమాని అంగీకార పత్రం, దరఖాస్తు.
- **కొత్త రేషన్‌కార్డు/ రేషన్‌కార్డు వేరుచేయడం:** దరఖాస్తు, ఆధార్‌కార్డు జిరాక్సు, పాతరేషన్ కార్డు (స్ప్లిట్), హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ (న్యూరైస్ కార్డు)
- **హౌస్‌హోల్డ్ స్ప్లిట్:** దరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, మ్యారేజ్ సర్టిఫికెట్/రైస్‌కార్డు/ఆరోగ్యశ్రీకార్డు

ఇంటికే వచ్చి సర్టిఫికెట్ ఇచ్చారు..



మా అమ్మ ఇటీవలే మరణించింది. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం వలంటీర్లు చెప్పి దరఖాస్తు చేయించారు. ఎఫ్ఎంసీ సర్టిఫికెట్ ఉచితంగా నేరుగా ఇంటికే తీసుకొచ్చి ఇచ్చారు.

– సోపంగి జోగేంద్ర శ్రీనివాస్, హడ్కో కాలనీ, శ్రీకాకుళం

ఉచితంగా ఇవ్వడం సంతోషం..



వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకే వచ్చి కావాల్సిన సర్టిఫికెట్లు ఉచితంగా అందించడం బాగుంది. అడుగు బయట పెట్టకుండా, రూపాయి చెల్లించకుండా నాలుగు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు తీసుకున్నాం.

– జడే లక్ష్మి, మండల వీధి, శ్రీకాకుళం

శుభపరిణామం..



లబ్ధిదారుల తలుపుతట్టి సర్టిఫికెట్లు ఇవ్వడం శుభపరిణామం. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు సమన్వయంతో జగనన్న సురక్ష ఓ పండుగ మాదిరిగా జరుగుతోంది. మరో 15 రోజులు కార్యక్రమం జరుగుతుంది.

– చల్ల ఓబులేసు, కమిషనర్, శ్రీకాకుళం కార్పొరేషన్

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడుల


సేంద్రియ ఎరువుల తయారు చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సేంద్రియ ఎరువులు, ద్రావణాలు, కషాయాలు దోహదపడతాయని ప్రకృతి వ్యవసాయం నేచరల్ మాస్టర్ కె.రాజేశ్వరమ్మ అన్నారు. ఆదివారం జాడ గ్రామంలో సేంద్రియ ఎరువుల తయారు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించగలమన్నారు. బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, వావిలాకు కషాయం, తూటికాడ కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, మారేడు పత్రం కషాయాలను తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేష్, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు..

అల్లినగరంలో సత్యసాయి గ్రామసేవ


సత్యసాయి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: సత్యసాయి సేవాసమితి పెద్దమందిరం ఆధ్వర్యంలో ఆదివారం అల్లినగరంలో ఆదివారం సత్యసాయి గ్రామసేవ నిర్వహించారు. తిరువీధి, భజన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా సేవాదల్ సమన్వయకర్త సూర రామచంద్రరావు మాట్లాడుతూ పల్లె సేవయే పరమాత్ముని సేవ అన్న లక్ష్యంతో గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పల్లకీ సేవ, ప్రేమతరు కార్యక్రమం, మొక్కలు నాటటం, నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 3న టెక్కలిలో జిల్లా సేవాదల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకురావాలి


రక్తదానం చేస్తున్న యువత

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో బొత్స జగదీష్ ఆధ్వర్యంలో ఆదివారం 35 మంది రక్తదానం చేశారు. తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా బాధిత పిల్లలు రక్తం కొరతతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈ రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.తవుడు, టి.మోహన్ కృష్ణ, జామి శబరీష్, సిబ్బంది కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, బి.సతీష్‌కుమార్, ఎ.నర్సింగరావు, ఆయుష్‌బేగం పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత పాటుపడాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు తిరుపతిపాలెం ఎస్సీ కాలనీ యువతకు అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొర్లె శ్రీనివాసరావు, నాయకులు ఆకుల గోపి, మండల రవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పలాస: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. చినంచల గ్రామం శివాలయం ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టారు. ఉసిరి, మారేడు, కదంబం, బాదం, వేప తదితర ఔషధ మొక్కలను నాటారు. వర్షాకాలంలో మొక్కలను నాటితే త్వరగా ఉపయోగంలోకి వస్తాయన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి, గ్రామ పెద్ద బొత్స మధుబాబు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఆస్పాన మధుబాబు, రోణంకి వెంకటరమణ, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాస్, బోకర దుర్యోధన, మన్మథరావు, ఆర్డీవో దాసరి వైకుంఠరావు, తిరుమలరావు పాల్గొన్నారు.

అరసవల్లిలో భక్తుల సందడి

- స్వామివారిని దర్శించుకున్న గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీపీ మీనా


సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు


మీనాకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది భక్తులు తమ కుటుంబాలతో సహా మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయంలో స్వామి వారి మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణలతో సర్వదర్శనాలకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం కొందరు భక్తులు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఏర్పాట్లు చేశారు. కేశఖండనశాలలో భక్తులు తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని రాష్ట్ర గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీపీ ఆర్.కె.మీనా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈయన వెంట జిల్లా అడిషనల్ ఎస్పీ తిప్పేస్వామి, డీఎస్పీ ప్రసాదరావు, ఎస్సై బలివాడ గణేష్ తదితరులున్నారు.

స్ఫూర్తిప్రదాత బాలగంగాధర్ తిలక్


లావేరు: తిలక్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయాధికారి


ఎచ్చెర్ల క్యాంపస్: తిలక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

లావేరు : బాలగంగాధర్ తిలక్ ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని లావేరు శాఖా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు లైబ్రరీలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో తిలక్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అనంతరం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో బాలగంగాధర్ తిలక్ జయంతి నిర్వహించారు. తిలక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులతో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు.

గురుపౌర్ణమికి ఆద్యుడు శ్రీకృష్ణుడు


ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: గురుపౌర్ణమి రోజున పూజ్యనీయుడు శ్రీకృష్ణ భగవానుడే అని, ఆయనే బోధించిన భగవద్గీత అందుకు ఆధారమని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారకులు అన్నారు. గార మండలం బూరవెల్లి గ్రామంలో త్రైతసిద్ధాంత భగద్గీత ప్రచారకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. పరమాత్మ అంతం లేనివాడు కావడం వల్ల గురువుగా పోల్చవచ్చన్నారు. కార్యక్రమంలో తలసముద్రంకు చెందిన త్రైత సిద్ధాత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు శ్రీనివాస్, కల్యాణి, ధన్వంతరి కృష్ణ, ప్రదీప్, జ్యోరతి మౌనిక, గోవింద్, నాగరాజు, సాయి పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో భక్తి కార్యక్రమాలు


లఘునాటికను ప్రదర్శిస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ మందిరంలో ఆదివారం పలు భక్తి విశేష కార్యక్రమాలు నిర్వహించారు. భజనలు, కీర్తనలు, ప్రవచనం, లఘునాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

బీఎస్ రావుకు నివాళులు


నివాళులు అర్పిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యావ్యవస్థలో శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బి.ఎస్.రావు చెరగని ముద్ర వేసి వేశారని విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ బంగారుబాబు అన్నారు. బీఎస్ రావు మృతి నేపథ్యంలో ఆదివారం శ్రీకాకుళం నగరంలోని కన్వెన్షన్ హాలులో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కూన రవి, గుండ లక్ష్మీదేవి, శ్రీచైతన్య విద్యాసంస్థల డీఎన్ కె.మురళీధర్, ఏజీఎం పి.నర్సునాయుడు, ఆర్ఐ ఎస్.రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫరీదుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేటలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మొదలవలస చిరంజీవి తెలిపారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నేతృత్వంలో జరిగే ఈకార్యక్రమాన్ని నాయకులు, అధికారులు విజయవంతం చేయాలని కోరారు.

కల్లేపల్లిలో క్యాన్సర్ శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కల్లేపల్లి గ్రామంలో మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి తరఫున సర్పంచ్ గంగు నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సుభద్ర, స్వప్న, ఏరియా మేనేజర్ దినేష్, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, గ్రామస్తులు బమ్మిడి సూర్యనారాయణ, దుంగ శ్రీధర్, మూకళ్ల నీలం, గొద్దు నీలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాపకశక్తి


పుస్తకం చదువుతున్న విద్యార్థి

శ్రీకాకుళం అర్బన్: చదివితే జ్ఞాపకశక్తి పెరుగుతుందని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో చదవడం–మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవడం నేర్చుకోవాలన్నారు. గ్రంథాలయాన్ని ఇష్టంగా భావించి కథలు, కవితలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైనట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఎస్సీ వీధిలో నివాసముంటున్న విద్యార్థిని ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఎప్పట్లాగే ఈ నెల 22న ఉదయం 8.30 గంటలకు కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో తల్లి ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించండి


మొక్కనాటుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

కాశీబుగ్గ: ప్రజలకు అధునాతన సేవలు అందిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు అన్నారు. పలాస ఆర్టీసీ డిపోను ఆదివారం సందర్శించారు. తొలుత కాంప్లెక్సులో ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై ఆయన ఆరాతీశారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కను నాటారు. గ్యారేజీని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. పరిసరాల్లో ఉన్నటువంటి స్థలాలను లీజుకు ఇచ్చే విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడి ఆరాతీశారు. సంస్థకు చెంది ఖాళీగా ఉన్న స్థలాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. రానున్న కొద్ది రోజుల్లో కొత్త బస్‌లను డిపోకు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. సంస్థలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ప్రభుత్వం చక్కనైన ప్రణాళికతో సంస్థను అభివృద్ధి చేస్తోందని.. అందుకు అందరూ సహకరించాలన్నారు. సంస్థ బాగుంటే అందరం బాగుంటామని.. అప్పుడే అద్భుతమైన సేవలు ప్రజలకు అందించగలమన్నారు. కార్యక్రమంలో విజయనగరం జోన్–1 ఈడీ అప్పలరాజు, ఓఅండ్‌పీ అప్పలనాయుడు, శ్రీకాకుళం డీపీటీవో విజయకుమార్, పలాస డిపో మేనేజర్ ఆర్.సీతంనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్, అన్ని యూనియన్ల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్ : ప్రకృతి వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని రిసోర్సుపర్సన్ నేతింటి మీనా అన్నారు. ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయ సాగుపై ఆదివారం స్థానిక స్వయం సహాయక సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎచ్చెర్లలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. జీవామృతం, కషాయాలు, కూరగాయలు విత్తనాలు వంటివి అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీదేవి, తులసి పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం


సమావేశంలో పాల్గొన్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: యాంత్రిక జీవితంలో సంపూర్ణ ఆరోగ్యం ఇచ్చేది ఒక్క నడక మాత్రమేనని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు 102 మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పి.జి.గుప్తా అన్నారు. ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ క్లబ్స్ ప్రతినిధులు సమావేశమయ్యారు. 2025 సంవత్సరానికి గాను గవర్నర్ ఎంపిక కోసం వివిధ క్లబ్స్ ప్రతినిధులు అభిప్రాయాలు స్వీకరించారు. చేపట్టాల్సిన సామాజిక సేవలు వివరించారు. కార్యక్రమంలో స్టార్‌వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు, ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి.ప్రసాద్, బి.వి.రవిశంకర్, బి.దేవీప్రసాద్, డాక్టర్ జి.నారాయణరావు, కొంక్యాన మురళీ, నాగేశ్వరరావు, బి.జగదీశ్వరరావు, ఐ.కె.రావు, ఎస్.ఈశ్వరరావు, జి.సత్యనారాయణ, గొర్లె వాసుదేవరావు, డాక్టర్ గజల్స్ వాసుదేవ్ పాల్గొన్నారు.

నిద్దాంలో విషాదం


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలో నిద్దాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, సహకార సంఘం చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు కొడలు ఏర్నేన ప్రశాంతి (28) గుండెపోటుతో మృతి చెందారు. ఈమె భర్త శ్రీనివాసరావు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎంపీపీ మీసాల సత్యవతి, జెడ్పీటీసీ కాయల రమణ, నాయకులు మీసాల వెంకటరమణ, మక్క వెంకటిసాయి, పిల్లల శివకుమార్, మీసాల రాంబాబు, తోలేటి వెంకటరావు, డోల వెంకటరమణ, వెంకట అప్పారావు, భూపతి సురేష్‌కుమార్, బత్తుల సన్యాసిరావు, సాకేటి నాగరాజు, శ్రీరామమూర్తి తదితరులు ప్రశాంతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

తేనేల కుటుంబానికి పరామర్శ


మంగయ్యనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అధికారులు, నాయకులు

లావేరు: మురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డు హెచ్‌ఎం తేనేల మంగయ్యనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదివారం లావేరు ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, మండల పంచాయతీ అధికారి వి.విశ్వేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ లింగాల అప్పన్న, పంచాయతీ కార్యదర్శి కె.వి.ప్రసాద్, కోటబొమ్మాళి ఎంపీడీఓ కుప్పిలి పణీంద్ర, మురపాక హైస్కూల్ హెచ్‌ఎం ఎం.అరుణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.సుధ, పొందూరు జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, నెల్లిమర్ల, లావేరు మాజీ జెడ్పీటీసీలు గొర్లె వెంకటరమణ, పిన్నింటి మధు, లావేరు మాజీ ఎంపీపీ మీసాల వెంకటరమణ, బీజేపీ మండల అధ్యక్షుడు ఇజ్జాడ శ్రీనివాసరావు తదితరులు పరామర్శించి సంతాపం తెలియజేశారు. వీరితో పాటు మురపాక సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాస నాయుడు ఉన్నారు.